
ప్రజాశక్తి

సోమవారం 7 జులై 2025

పార్వతీపురం మన్యం



అన్ని కార్యాలయాల్లో పిజిఆర్ఎస్ : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)ను అన్ని కార్యాలయాల్లో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. అన్ని కార్యాలయాల్లో ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందని ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పిజి ఆర్ ఎస్ వివరాలు 1100 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులు Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్‌నూ అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీల నమోదు, నమోదైన అర్జీల స్థితి, దానికి సంబంధించి సమాచారం తెలుసుకొనేందుకు 1100 నెంబరుకు కాల్ చేయవచ్చని తెలిపారు.

పెరుగుతున్న రోగుల తాకిడి

- కానరాని సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు
- పెద్ద జబ్బులొస్తే నగరాలకు వెళ్లాల్సిందే
- ఏళ్లతరబడి లేని రేడియాలజిస్టు
- పేరు కే జిల్లా కేంద్ర ఆసుపత్రి, సేవలు నాస్తి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా కేంద్రాస్పత్రిలో వైద్య సేవలు పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఉన్నాయి. గుండె, కిడ్నీ, న్యూరాలజీ, కేన్సర్‌కు సంబంధించిన వైద్యులు లేరు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి స్థాయికి అప్ గ్రేడ్ చేసినా సేవలు మాత్రం ఏరియా ఆసుపత్రి స్థాయిలోనే ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతం ఎక్కువగా ఉన్న, వ్యవసాయ ప్రధానమైన జిల్లా కావడంతో నిరక్షరాస్యులు, వ్యవసాయ కూలీలు ఎక్కువగా ఉన్న ప్రాంతమిది. మద్యపానం, ధూమపానం వంటి వ్యసనాలతో పాటు వేళాపాళా లేని ఆహారపు అలవాట్లు కూడా ఈ ప్రాంత ప్రజలను ఎక్కువగా గుండె, కిడ్నీ, నరాలబలహీనత, కేన్సర్ వంటి రోగాల బారిన పడేలా చేస్తున్నాయి. ఇలాంటి ప్రమాదకరమైన జబ్బులేవి వచ్చినా విజయనగరం, విశాఖపట్నం లాంటి నగరాలకు పరుగుతీయాల్సిందే. నగరాల్లో ఉన్న కార్పొరేట్ ఆసుపత్రులకో, కెజిహెచ్, మహారాజా ఆసుపత్రులకు వెళ్ళాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. మన్యం జిల్లా ఏర్పాటై మూడున్నర ఏళ్ళు కావస్తోంది. పొరుగునున్న శ్రీకాకుళం, విజయనగరం జిల్లా కేంద్రాసుపత్రుల్లో ఉన్న వైద్య సేవలు కూడా ఇక్కడ అందడం లేదు. గత ప్రభుత్వ హయాంలోనే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి స్థాయికు అప్‌గ్రేడ్ చేశారు. అయితే ఇందుకు సంబంధించిన భవన నిర్మాణం నత్తనడకన సాగుతోంది. పనులు జరిగిన వెంటనే ప్రభుత్వాలు బిల్లులు మంజూరు చేయకపోవడంతో భవన నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇది పూర్తయితే ఆసుపత్రిలో బెడ్ల ఏర్పాటుకు వసతి సమస్య పరిష్కారమవుతుంది. 150 బెడ్ స్థాయికు అప్ గ్రేడ్ చేసినా వసతి సమస్య వెంటాడుతోంది. ప్రస్తుతం ఆసుపత్రిలో గైనకాలజీ, సర్జరీ, కంటి, చిన్నపిల్లలు, చర్మవ్యాధులు, సైకాలజీ, దంత వ్యాధులు, ఎముకలు, చెవి, ముక్కు, గొంతు వ్యాధులతో పాటు అత్యవసర సేవలు కూడా అందుతున్నాయి. రాత్రీ పగలు మూడు షిఫ్ట్‌ల్లో వైద్యులు పని చేస్తున్నారు. రోజువారీ రోగుల తాకిడి 700 నుంచి 800 వరకు ఉంటుంది. ఇక్కడకి వచ్చిన రోగుల్లో అధికశాతం దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలకు చెందిన వారే వున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు కూడా అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ వైద్య కళాశాల కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం చాలా ఉంది. ఎందుకంటే గిరిజనులు ఎక్కువగా నివసిస్తున్న మన్యం జిల్లాలో ఎక్కువ మంది అంతుచిక్కని వ్యాధులతో బాధపడుతూ ఆసుపత్రికి వస్తుంటారు. ఏజెన్సీ ప్రాంతంలో నిరక్షరాస్యత, మూఢనమ్మకాలు, ఆచార, సాంప్రదాయాల కారణంగా బాల్యవివాహాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. దీనివల్ల ఎక్కువమంది ఆరోగ్య సమస్యల్ని కొనితెచ్చుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు, ఆహారపు అలవాట్లను అధ్యయనం చేసి మార్పు తీసుకురావడానికి అత్యాధునిక వైద్య సేవల అవసరం ఎంతో ఉంది.



జిల్లా కేంద్రాసుపత్రి

ఏళ్ళతరబడి కానరాని రేడియాలజిస్టు

స్థానిక జిల్లా కేంద్రం ఆసుపత్రిలో ఏళ్లతరబడి రేడియాలజిస్టు కొరత వెంటాడుతూనే ఉంది. ప్రతి చిన్న ఆరోగ్య సమస్య నుంచి పెద్ద పెద్ద జబ్బుల వరకు స్కానింగ్ పరీక్ష చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. అయితే గత కొంతకాలంగా ఆసుపత్రిలో స్కానింగ్ డాక్టర్ లేకపోవడంతో నిరుపేద గిరిజనులు, దళితులు, వెనుకబడిన తరగతుల రోగులు చేతి చమురు వదిలించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల అవసరం ఉంది

జిల్లా కేంద్రాస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. దీని కోసం భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇది పూర్తయితే ఆసుపత్రిలో వసతి సమస్య పరిష్కారమవుతుంది. గుండెపోటుకు గురయ్యే రోగులకు తక్షణ వైద్య చికిత్సలో భాగంగా స్టెమీ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. ఈ ఇంజెక్షన్ చేయించుకున్న గుండె పోటు రోగి మూడు గంటల వరకు సురక్షితంగా వుండొచ్చు. ఈలోగా గుండె వైద్య సేవలు అందించే ఆసుపత్రికి వెళ్లిపోవచ్చు. ఈ ఇంజెక్షన్ ఖరీదు రూ.45వేలు. జిల్లా కేంద్రాస్పత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలందించే ప్రయత్నం జరుగుతోంది.

డాక్టర్ నాగభూషణరావు,
జిల్లా సమన్వయకర్త, ఆసుపత్రుల సేవలు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు



ఆక్రమణకు గురవుతున్న వెంకట్రాయుని కోనేరు

గాలికి వదిలేసిన వెంకట్రాయుని కోనేరు

ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ నడిబొడ్డునున్న వెంకటరాయిని కోనేరును అధికారులు గాలికి వదిలేశారు. చేపల పంపకానికి ప్రతి ఏటా ఇచ్చినప్పటికీ ఈ ఏడాది ఇవ్వకపోవడంతో చెరువులో ఉన్న చేపలను కొంతమంది వ్యక్తులు ఇష్టారాజ్యంగా వ్యాపారం చేసుకుంటున్నారు అంతేకాకుండా చేపల చెరువు కూడా పూర్తిగా పాడైంది. ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు నగర పంచాయతీ పరిధిలో మత్స్యకారులు చేపల చెరువు లీజుకు ఇవ్వకపోవడంతో ఉపాధి కోల్పోయారు. దీంతో వారంతా రోడ్లు పడ్డారు. ప్రతి ఏటా మత్స్యకారులకు లీజుకు ఇస్తే పంచాయతీకి ఏడాదికి రూ.50వేలు వరకు ఆదాయం వచ్చేది. చెరువు సుందకరీణం చేస్తామన్న ప్రతిపాదనలతో చెరువు లీజుకు ఇవ్వకపోవడంతో పూర్తిగా పాడైంది. నగర పంచాయతీ ఆదాయానికి గండితో పాటు చెరువు కూడా పూర్తిగా పాడైంది దీనిపై నగర పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎప్పటికైనా నగర పంచాయతీకార్లు పూర్తిస్థాయిలో కోనేరు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

భారత కబడ్డీ జట్టుకు మణికంఠ ఎంపిక

ప్రజాశక్తి - పాలకొండ



మణికంఠను అభినందిస్తున్న కొండలరావు, చంద్రశేఖర్

సాధారణ గిరిజన కుటుంబంలో పుట్టి భారత కబడ్డీ జట్టు ప్రొబబుల్స్‌కు సీతంపేట ఆదివాసీ బిడ్డ పాలక మణికంఠను ఎంపికయ్యాడు. ఈ మేరకు మణికంఠను కబడ్డీ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు పల్లా కొండలరావు, కార్యదర్శి వెన్నపు చంద్రశేఖర్ ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పల్లా కొండలరావు మాట్లాడుతూ మట్టిలో పుట్టిన మాణిక్యం మణికంఠను అభివర్ణించారు. భవిష్యత్తులో క్రీడల్లోకి వచ్చే యువతకు స్ఫూర్తిదాయకంగా మణికంఠ ఎదుగుదల ఉందని, దీన్ని అలాగే కొనసాగించి ఈ ప్రాంతానికి మంచిపేరు తీసుకురావాలని తెలిపారు. ఇటీవల హరిద్వార్‌లో జరిగిన నేషనల్ మీట్‌లో మన రాష్ట్రానికి కెప్టెన్‌గా వ్యవహరించిన మణికంఠ ఆటతీరును చూసి భారత ప్రొబబుల్స్‌కు ఎన్నిక చేసినట్టు సెక్రటరీ వెన్నపు శేఖర్ తెలిపారు. తనను ఎంతగానో ప్రోత్సహించి శిక్షణ ఇచ్చిన కోచ్‌లకు, పల్లా కొండబాబు, వెన్నపు శేఖర్‌కు మణికంఠ కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి

ప్రజాశక్తి - కొమరాడ



కొమరాడలో ప్రచారం చేస్తున్న మంత్రి సంధ్యారాణి

రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి చేస్తూ ప్రభుత్వం పాలిస్తుందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మండలం లోని మార్కొండ పుట్టిలో ఆదివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏడాదిలోనే ఇచ్చిన హామీలు అమలు చేసిన కూటమి ప్రభుత్వానిదన్నారు. రాష్ట్రంలో ఆర్థికలోటు ఉన్నప్పటికీ సంక్షేమం, అభివృద్ధిని కొనసాగిస్తున్నామన్నారు. తల్లికి వందనం పథకం అమలు చేసి ప్రతి ఇంట్లో తల్లిదండ్రులకు ధైర్యం కలిగించామన్నారు. రాష్ట్ర ప్రగతికి మరిన్ని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా మరోసారి ప్రతి ఇంటిలో టిడిపి కుటుంబ సభ్యులను, ప్రజలను కలుసుకునే అవకాశం కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కురుపాం ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.శేఖర్ పాత్రుడు, ట్రైకార్ కార్పొరేషన్ చైర్మన్ పువ్వుల లావణ్య, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్, నాయకులు దేవకోటి వెంకటనాయుడు, గుణాపురం ఎంపీటీసీ సంతోషి, టిడిపి క్లస్టర్ కోఆర్డినేటర్ జి త్రినాధం, స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్‌కుమార్ అన్నారు. కురుపాంలో ఆదివారం ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ ఏడాది కాలంలో సూపర్ సిక్స్, సంక్షేమ పథకాల అమలు తీరుపై, ప్రజల సంతృప్తి స్థాయిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చి తొలి అడుగు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కర్రి శ్రీను, త్రిపుర, రామకృష్ణ, నాగరాజు, సాయి, నగేష్, త్రినాథ, మురళి, గంగులు, మిన్న, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జిలు పాల్గొన్నారు.

చినబగ్గ కొండల్లో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని చిన్నబగ్గ కొండల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. దీంతో గిరిజనులకు క్షణ క్షణం భయపడుతున్నారు. కొండపోడుకు వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. దీంతో చుట్టుపక్క గ్రామాల గిరిజనులకు కంటిమీద కునుకు లేకుండా పోతుంది. తక్షణమే ప్రభుత్వం, అధికారులు స్పందించి ఏనుగుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

- పని గంటలు పెంచొద్దు
- 9న సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జులై 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వామపక్ష ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో ఐఎఫ్‌టియు నాయకులు పోల ఈశ్వర రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్మికుల ప్రాణ త్యాగాలతో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి బడా కంపెనీల యజమానులకు అనుకూలంగా చట్టాలను మారుస్తున్నారని చెప్పారు. కార్మికుల శ్రమ దోపిడీని దోచుకుతినేలా చట్టాలను రూపొందించడం అన్యాయమన్నారు. ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసి దేశంలో ప్రభుత్వ ఆస్తులన్నీ ఆదానీ, అంబానీ వంటి కుబేరులకు కట్టబెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. కేంద్రం పనిగంటలను 12 గంటలకు, రాష్ట్ర ప్రభుత్వం 10 గంటలకు పని గంటల పెంచి, జీతాలు పెంచకుండా దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. కార్మికులకు పోరాడే, ఉద్యమాలు చేసే హక్కు లేకుండా చేయాలని, సంఘం పెట్టుకునే హక్కు లేకుండా చేస్తున్నాయని చెప్పారు. రైతుల పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయడం లేదన్నారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి నిధులు పెంచడం లేదని, కార్మికులను కట్టుబానిసలుగా మార్చే ఈ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని జరుగుతున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలపై కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. బిజెపి విధానాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్న తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 9న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో అంగన్వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులు, యానిమేటర్లు, గ్రామ సేవకులు, ఆటో కార్మికులు, ఆశా వర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైస్ మిల్ కార్మికులు, మున్సిపల్, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులు, విద్యుత్తు, పంచాయతీ వర్కర్స్, పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, ఎఐటియుసి జిల్లా నాయకులు జీవ, ఎఐకెఎంఎస్ నాయకులు నర్సింగరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీదేవి, సిఐటియు నాయకులు గొర్ల వెంకటరమణ, రెడ్డి వేణు, బంకురు సూరిబాబు, బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్రజాసంఘాల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ

గుమ్మలక్ష్మీపురం : ఈనెల 9న చేపట్టబోయే సార్వత్రిక సమ్మెలో కార్మికులు, కర్షకులు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ పిలుపునిచ్చారు. గుమ్మలక్ష్మీపురంలో సిఐటియు ఆధ్వర్యాన ఆదివారం వివిధ రంగాల కార్మికులతో కలిసి సిఐటియు మండల కన్వీనర్ కె.గౌరీశ్వరరావు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, భవననిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను వారికే ఖర్చు పెట్టేలా చట్టం రూపొందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు కనీస వేతనాలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని, గిరిజనులు, రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, ఉపాధి హామీ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు సత్యవతి, కస్తూరి, సుధా, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీలత, మధ్యాహ్నం భోజనం సంఘం నాయకులు లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రాము పిలుపునిచ్చారు. మండలంలోని ఆర్.వెంకంపేటలో భవన నిర్మాణ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి గతంలో బోర్డు ఉండేదని, ఆ బోర్డు కనీసం ఇప్పుడు ఉందో లేదో తెలియని పరిస్థితి ఉందన్నారు. కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకొచ్చి భవన కార్మికులకు ఉపాధి దెబ్బ కొడుతుందని విమర్శించారు. ఇలా ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా చేపట్టిన సమ్మెలో భవన నిర్మాణ కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి జి వెంకటరమణ, పలువురు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయం అంతర్రాష్ట్ర రహదారి



గొయ్యిలో బోల్తా పడ్డ కూరగాయల వ్యాన్

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం నుంచి కూనేరు వరకు ఉన్న అంతర్రాష్ట్ర రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. దీంతో నిత్యం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆర్తాం నుంచి కోటిపాం వరకు నాలుగు ప్రదేశాల్లో రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రతి గంటకు ఏదో ఒక వాహనం గొయ్యిలో పడిపోవడమో, ఒరిగిపోవడమో, జరుగుతున్నాయి. ఆదివారం పార్వతీపురం నుంచి కూనేరు వైపు వెళు_న్న కూరగాయల వ్యాను గోతులో బోల్తాపడడంతో సుమారు రూ.50 వేలు విలువైన కూరగాయలు బురదలో కలిసిపోయాయి. దీంతో డ్రైవరు కన్నీరుమున్నీరై కూరగాయలు కొనుగోలు చేసిన రైతులకు డబ్బులు ఎలా ఇవ్వాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే గానీ, అధికారులు గానీ కనీసం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు ఎలా వేయడంలేదు కనీసం గోతులనైనా కప్పి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నా కనీసం పట్టించుకోకపోవడం దారుణమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడుగడుగుకు బిక్కుబిక్కుమంటూ వాహనదారులు ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఈ రహదారులపై ఏర్పడింది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ప్రభుత్వం స్పందించి రోడ్లపై ఏర్పడిన గుంతలను తాత్కాలికంగానైనా పూడ్చి ప్రమాదాలను నివారించాలని, వాహనచోదకులు, ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఒక గోతులో కూరగాయల వ్యాను... మరో గొయ్యిలో లారీ



గోతులో దిగబడిపోయిన లారీ

వీడని ముసురు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం



చిత్తడిగా మారిన హాస్టల్ ఆవరణ

గుమ్మలక్ష్మీపురం మన్యాన్ని గత వారం రోజులుగా ముసురు పట్టింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రభుత్వ కార్యాలయాలు, వసతి గృహాలు, ప్రధాన రహదారులన్నీ బురదమయం కావడంతో నడవడానికి ఇబ్బందిగా మారింది. మరోవైపు కూరగాయల వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అపారిశుధ్య వాతావరణంతో దోమల వ్యాప్తి ఎక్కువగా కనిపిస్తుంది. వర్షాలు కారణంగా ప్రజలు కాచి వడబోసిన నీటిని తాగాలని, దోమతెరలు వాడకం చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యం కాపాడుకోవాలని భద్రగిరి వైద్యులు ఆర్. రవికుమార్ కోరారు.


బురదమయమైన కోలిసిగూడకు వెళ్లే రోడ్డు

కోలిసిగూడకు బిటి రోడ్డు సౌకర్యం కల్పించండి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని పెదగొత్తిలి పంచాయతీలో గల కోలిసిగూడకు బిటి రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు. ఆదివారం 'ప్రజాశక్తి'తో వారు మాట్లాడుతూ కొలిసి గ్రామం బిటి రోడ్డు నుంచి కొలిసిగూడ వరకు సుమారు రెండు కిలోమీటర్లు మట్టి రోడ్డు ఉందని, ఇది వర్షం పడితే పూర్తిగా బురద మయమై కాలు తీసి కాలు వేయలేని పరిస్థితి ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు కిలోమీటర్లు బిటి రోడ్డు వేయాలని అనేక సార్లు వినతి పత్రాలు అధికారులకు, ప్రజాప్రతినిధులకు అందించినా ఇంతవరకూ పట్టించుకునే నాధుడే కరువయ్యాడని వాపోయారు. దీంతో వర్షాలు పడిన సమయంలో నడవడానికి చాలా కష్టమవుతుందన్నారు. ఏ చిన్న అవసరం వచ్చినా మొండెంఖల్‌కు ఈ రోడ్డు గుండానే వెళ్తున్నామన్నారు. అత్యవసర సమయంలో కనీసం 108 వాహనం కూడా వచ్చే పరిస్థితి లేక కాలినడక డోలీ మోతతో తప్పని పరిస్థితిల్లో రోగిని తీసుకెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి తమ గ్రామానికి బిటి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.


వాహనాల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ

వాహన తనిఖీలు

ప్రజాశక్తి -సీతానగరం

స్థానిక హనుమాన్ జంక్షన్‌లో ఆదివారం ఎస్సై ఎం.రాజేష్ వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం వాహనదారులతో మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ధరించాలన్నారు. తెలియని వ్యక్తులు అనవసరపు కాల్స్ వస్తే వాటిని తిరస్కరించాలన్నారు. వాట్సాప్‌ల ద్వారా వచ్చే మెసేజ్‌లను గమనించాలని, సైబర్ నేరాల పట్ల అవగాహన ఉండాలని అన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండాలన్నారు. ప్రతి ఇంటి యజమాని వారి పిల్లల ఎప్పటికప్పుడు అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

శ్రీవిజయ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో రథయాత్ర ఉత్సవాలు జరుగుతున్న దృష్టిలో పెట్టుకొని నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావు అభ్యర్థుల మేరకు శ్రీ విజయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి వైద్యులు దగ్గరుండి యాత్రకు వచ్చిన వారికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మూడు రోజుల పాటు యాత్రలో వైద్య సేవలందించినట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ పద్మావతి తెలిపారు.

జనసేన టీమ్ ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి - పాలకొండ

జనసేన నియోజకవర్గ బృందం పట్టణంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన సంయుక్త కార్యదర్శి జనసేన జానీ మాట్లాడుతూ నియోజకవర్గంలో జనసేన కోసం గత పదేళ్లుగా కష్టపడి పనిచేసిన అనేకమంది ఉన్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే జయకృష్ణ గెలుపునకు ఎంతగానో కృషి చేశామన్నారు. అయితే భూదేవి గ్రూపు జనసేనకు వ్యతిరేకంగా పనిచేశారని ఆరోపించారు. భవిష్యత్తులోనూ జనసేన మరి అంత బలోపేతానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పోగ్రామ్ కమిటీ మెంబెర్ పొట్నూర్ రమేష్, పొగిరి జగన్, జామి అనిల్, సవర రాజేష్, రఘుమండల గణేష్, సవర సింహాద్రి, గోలి అనిల్, సవర గణేష్, పక్కి ప్రేమ్ ఇతర జనసైనుకులు పాల్గొన్నారు.

వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్


విద్యార్థుల సంక్షేమంపై బాధ్యతారహిత్యంగా ఉన్న డొకిశీల ఆశ్రమ పాఠశాలలో వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవి కుమార్ డిమాండ్ చేసారు. ఆదివారం ఎఎస్ఎఫ్ఐ బృందం వసతి గృహాన్ని సందర్శించింది. మెనూ ప్రకారంగా భోజనం పెట్టడం లేదని విద్యార్థులు తెలిపారన్నారు. ఆదివారం మెనూలో బిర్యానీ, చికెన్ ఉంటే, అన్నం, చికెన్ పెట్టారని తెలిపారు. చికెన్‌లో మిల్ మేకర్లు కలిపి విద్యార్థులకు పెట్టడంపై ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టళ్లలో విద్యార్థులు ఫోన్లుతో ఆడుకోవడం చూసి ఆశ్చర్యం కలిగిందన్నారు. అక్కడ పట్టించుకునే వారే లేక విద్యార్థులు రోడ్లపై తిరుగుతున్నారని తెలిపారు. విద్యార్థులకు ఏమైనా జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. నిర్లక్ష్యంగా ఉన్న వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు చరణ్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన ఆన్‌లైన్ సేవలు

చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మొండెంఖల్ పోస్ట్ ఆఫీసులో సుమారుగా 40 రోజుల నుంచి ఆన్లైన్ సేవలు లేక స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న పోస్టల్ యంత్రాంగం చోద్యం చూస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ ఏ చిన్న నగదు విత్‌డ్రా చేయాలన్నా, డిపాజిట్ చేయాలన్నా పోస్ట్ ఆఫీస్‌కు వెళ్లే వాళ్లమని, ఈ ఒక్క గ్రామం కాకుండా చుట్టుపక్కల సుమారు 20 గ్రామాల ప్రజలకు ఈ పోస్ట్ ఆఫీస్ దిక్కని చెబుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో 10 కిలోమీటర్లు దూరంలో ఉన్న గుమ్మలక్ష్మీపురం వెళ్లి బ్యాంకుల్లో నగదు వేయడానికి, తీయడానికి ఏ చిన్న అవసరానికైనా వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం వ్యక్తం చేశారు. అంతేకాకుండా సిబ్బందిని కూడా డిప్టేషన్ పద్ధతిలో వేస్తున్నారని, శాశ్వత సిబ్బందిని నియమించి ఆన్లైన్ సేవలను మరమ్మతులు చేపట్టి పోస్ట్ ఆఫీస్ సేవలందించాలని కోరుతున్నారు.


ఆన్‌లైన్ సేవలు నిలిచిపోవడంతో బోసిపోయిన పోస్టల్ కార్యాలయం

మూలకు చేరిన వాహనాలు

- తూతూ మంత్రంగా పారిశుధ్య పనులు
- కార్మికులకు తప్పని చెత్త తరలింపు కష్టాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో పారిశుధ్య మెరుగునకు కార్మికులు ఎంత ముఖ్యమో, అందుకు సంబంధించిన వాహనాలు కూడా అంతే ముఖ్యం. అయితే పారిశుధ్య నిర్వహణకు ఏ యంత్రం పనిచేస్తుందో... ఏ వాహనం మూలకు చేరిందోనన్న కనీస బాధ్యత మున్సిపల్ అధికారులెవరికీ. ఇందుకు నిదర్శనమే దీర్ఘకాలంగా జెసిబి, రెండు కాంపేక్టర్ వాహనాలు, బాబ్ కార్డు వాహనం మూలకు చేరినా అధికారులెవరూ పటించుకున్న దాఖలాల్లేవు. దీనివల్ల పారిశుధ్య కార్మికులకు పట్టణంలో ప్రతిరోజూ పారిశుధ్య నిర్వహణ, చెత్త తరలింపు కష్టతరంగా మారుతోంది. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులే కాదు, పాలకవర్గంగా కనీసం పట్టించుకోవడం లేదు. దీనిబట్టి చూస్తే వీరికి పట్టణ ప్రజల ఆరోగ్యం పట్ల ఎంత శ్రద్ధ ఉందో ఇట్టే అర్థమవుతుంది.

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రజారోగ్య విభాగం పరిధిలోని మూడు ట్రాక్టర్లు, ఒక టిప్పర్, రెండు కాంపేక్టర్ వాహనాలు ఉండేవి. వీటి ద్వారా ప్రధాన రహదారితో పాటు 30 వార్డుల్లో చెత్త సేకరణ జరిగేది. గత వైసిపి ప్రభుత్వ హయాంలో పట్టణ పరిధిలో గల 30 వార్డుల్లో ఉన్న 15 సచివాలయాలకు సంబంధించి చెత్త సేకరణకు 10 మినీ ఆటోలను ఏర్పాటు చేశారు. అయితే ఉన్న రెండు కాంపేక్టర్ వాహనాల్లో ఒక వాహనాన్ని అప్పటి కమిషనర్ రామఅప్పలనాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి అంచనాలకు మించి ముందస్తుగా రూ.లక్షా 70 వేలు మున్సిపల్ నిధులతో మరమ్మతులు చేయించినప్పటికీ, ఆ వాహనాన్ని తీసుకొచ్చేందుకు కనీసం చర్యలు చేపట్టలేదు. పలు వార్తా కథనాలతో ఆ వాహనాన్ని మున్సిపల్ ఎఫ్ఎసి కమిషనర్ శ్రీనివాసరాజు మున్సిపల్ కార్యాలయానికి తీసుకొచ్చినప్పటి నుంచి ఈరోజు వరకు వాడుకలోకి తీసుకురాకపోవడం దురదృష్టకరం. ఈ వాహనంతో పాటు ఉన్న ఒక్క కాంపేక్టర్ కూడా మరమ్మతుకు గురై మూలకు చేరింది. ఉన్న ఒక జెసిబి మూడు నెలల క్రితం మరమ్మతుల నిమిత్తం వైజాగ్‌కు పంపి ఇంత వరకు తీసుకురాలేదు. ఉన్న బాబ్ కార్డు వాహనం కూడా మరమ్మతులకు గురై మూలకు చేరింది. ఈ నాలుగు వాహనాలను మరమ్మతులు చేసేందుకు ఇటు మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం, అటు ప్రజారోగ్య విభాగం అధికారుల సమన్వయ లోపం కారణంగా పట్టించుకోకపోవడంతో పారిశుధ్య నిర్వహణ పనులు చేసేందుకు చెత్తను తరలించేందుకు పారిశుధ్య కార్మికులు నానా అవస్థలుపడుతున్నారు. వీటికి మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులు పలుమార్లు మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ చర్యలు చేపట్టకపోవడం వల్ల పట్టణంలో ప్రధాన రహదారితో పాటు 30 వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ పడకేసి, తూతూ మంత్రంగా జరుగుతుంది. మరికొన్ని రోజుల్లో వర్షాలు విస్తారంగా పడే అవకాశం ఉన్నందున, ముంపునకు గురయ్యే శివారు ప్రాంతాలతో పాటు లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు మళ్లించేందుకు జెసిబి, బాబ్ కార్డ్‌ల అవసరం ఎంతైనా ఉంటుంది. యుద్ధ ప్రాతిపదికన వీటికి మరమ్మతులు చేయించేందుకు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


మరమ్మతులకు గురైన జెసిబి



మూలకు చేరిన కాంపెక్టర్ వాహనం (ఫైల్)

కృష్ణపల్లి సర్పంచ్ రామినాయుడు మృతి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్



మండలంలోని కృష్ణపల్లి పంచాయతీ సర్పంచ్ బోను రామినాయుడు (65) ఆదివారం ఉదయం మృతి చెందారు. ఈయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈయన సర్పంచ్‌గానే కాకుండా వైసిపి సీనియర్ నాయకుడిగా పేరు ఉంది. ఆయన మృతితో మండలంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. రామినాయుడు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు, టిడ్కో మాజీ చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ కృష్ణపల్లి వెళ్లి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులు అర్పించి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అనంతరం ఆయన అంతమ యాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీతానగరం మండలం వైసిపి అధ్యక్షులు బొమ్మి రమేష్, పార్వతీపురం పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలుకడసారి వీడ్కోలు లో పాల్గొన్నారు.

అధికారుల్లేకుండా కార్మికులకు న్యాయం ఎలా? : సిఐటియు

ప్రజాశక్తి - సాలూరురూరల్

జిల్లాలో పాలకొండ, పార్వతీపురం, సాలూరు అసిస్టెంట్ లేబర్ కార్యాలయాల్లో పూర్తిస్థాయి అధికారులు నియమించకుండా ఇన్చార్జి లేబర్ అధికారులనే నియమించి, కార్మిక శాఖను నిద్రావస్థలోకి రాష్ట్ర ప్రభుత్వం, లేబర్ అధికారులు నెట్టేశారని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు విమర్శించారు. పట్టణంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఈ మూడు ప్రాంతాల్లో ఎఫ్ఎసి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లను నియమించకుండా కార్మికశాఖ కార్మిక సమస్యలపై పూర్తిస్థాయిలో ఏ విధంగా పర్యవేక్షణ చేస్తారని ప్రశ్నించారు. జిల్లాలోని హోటళ్లు, సినిమా థియేటర్లు, హాస్పటళ్లు, ఇతర విభాగాల్లో వివిధ సెక్షన్ల కార్మికులకు, ప్రజలకు అందుతున్న సౌకర్యాలపై పూర్తిస్థాయిలో లేబర్ అధికారులు లేకుంటే ఏ విధంగా పర్యవేక్షణ చేయగలరని ప్రశ్నించారు. ఇప్పటికే జిల్లాలో పరిశ్రమలు లేక కార్మిక వర్గం పరిస్థితి దీనస్థితిలో ఉందని, ఉన్న జీగిరాం జూట్ మిల్లు మూసివేసినా, లేబర్ అధికారుల్లోనూ, ప్రభుత్వంలో చలనం లేదని విమర్శించారు. దీంతో ఇక్కడి కార్మిక వర్గం రోడ్డున పడిందని, మిగిలి ఉన్న పరిశ్రమల్లో ఆయన కార్మిక వర్గం కష్టాలు తెలుసుకోవాలంటే పూర్తిస్థాయి లేబర్ అధికారులు అవసరమని అన్నారు. ఆ పరిస్థితి మెరుగుపడేలా రాష్ట్ర కార్మికశాఖ అధికారులు, జెసిఎల్ కృషి చేయడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా కలెక్టర్ జోక్యం చేసుకొని జిల్లాలో అవసరమైన అసిస్టెంట్ లేబర్ ఆఫీసుర్లను నియమించి ప్రజలకు సేవలందించేందుకు, అన్ని సెక్షన్లలో పర్యవేక్షణ పెంచేలా కృషి చేయాలని కోరారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి.రాముడు, మధుమోహన్, శంకర్రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు

ఆంధ్రా నుంచి దారి లేదు... ఒడిశా నుంచి వెళ్లేందుకు వీల్లేదు

ప్రజాశక్తి - కొమరాడ

ఒకవైపు నాగావళి నది మండల ప్రజలను వేరుచేసి రాకపోకలను స్తంభిస్తుంటే, మరో వైపు గిరిశిఖర ప్రాంతాలకు కనీసం రహదారి సౌకర్యలేక వారి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోని వారే కరువయ్యారు. గత 15 రోజులుగా కురుస్తున్న వర్షాలకు నదులు, గెడ్డలు, వాగులు పొంగుపొర్లుతున్నాయి. మండలంలోని మారుమూల ఏజెన్సీ గ్రామమైన కుంతేసు పంచాయతీ పరిధిలో గల పలు గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుంతేసుకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో రాకపోకలకు సుమారు 8 గ్రామాలకు గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆంధ్రా నుంచి రహదారి సదుపాయం లేక కొరాపుట్ జిల్లా నీలావడి, సోరుపల్లి మీదగా గోతులు, రహదారి సదుపాయం ఉండడంతో కొంతమేరకు రాకపోకలకు అవకాశం ఉండేది. ఇటీవల కాలంలో గత 15 రోజులుగా కురుస్తున్న వర్షాలకు గెడ్డలు, వాగులు పొంగిపొర్లడంతో రాకపోకలు కూడా స్తంభించాయి. కుంతేసు సమీపాన ఒడిశా సరిహద్దులో ఒక కొండవాగు, గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కుంతేసు, గొర్రెలమ్మ, జొప్పంగి, వానబడి, దర్బింగి తదితర గ్రామాల ప్రజలు వివిధ అవసరాల కోసం పార్వతీపురం మీదుగా కొమరాడ రావాల్సి ఉంది. గెడ్డలో నీరు ఉధృథంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కుంతేసు నుంచి లంజి పూడేసు మీదుగా ఉన్న రహదారి సదుపాయం సక్రమంగా లేకపోవడంతో రాకపోకలు చేసేందుకు ఇబ్బందులు పడుతూ అనారోగ్యం బారిన పడిన సమయంలో కూడా డోలిమోతలతో రావాల్సిన పరిస్థితి గిరిజనులకు ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన పడుతున్న ఇబ్బందులపై దృష్టి పెట్టి వారికి రోడ్డు సదుపాయం కల్పించాలని గిరిజన ప్రజలు కోరుతున్నారు.


కుంతేసుకు వెళ్లే మార్గమధ్య ప్రవహిస్తున్న కొండవాగు

కుక్కలకు రేబిస్ టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి - బలిజిపేట

స్థానిక పశు వైద్య కార్యాలయం వద్ద ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా 60 పెంపుడు కుక్కలకు పిచ్చి కుక్క వ్యాధి (రేబిస్)రాకుండా నివారణకై ఉచితంగా టీకాలను మండల పశు వైద్య అధికారి గణేష్ సమక్షంలో ఆదివారం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ మనుషుల నుంచి పశు పక్షాదులకు, మళ్లీ వాటి నుంచి మనుషులకు సోకే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం గ్రామాల్లో ఉన్న వెటర్నరీ అసిస్టెంట్‌తో వివిధ గ్రామాల్లో జూనోసిస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక పశు వైద్యశాల వద్ద సుమారుగా 50 పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ వ్యాధి టీకాలను పశు వైద్యధికారి పి.లక్ష్మణరావు వేశారు. రేబిస్ టీకాలను ప్రతి ఏటా పెంపుడు కుక్కలకు పశు సంవర్ధక ఉచితంగా వేస్తుందని, కావున పెంపకందారులు తప్పనిసరిగా ఈ టీకాలను కుక్కలకు వేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక పశు వైద్యశాలలో ప్రపంచ జూనోసిక్ దినోత్సవం సందర్భంగా పశు సంవర్ధక శాఖ ఎడి బి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు యాంటీ రాబి రాబిస్ టీకాలను వేశారు.



బలిజిపేటలో కుక్కకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

పలుచోట్ల ప్రపంచ జూనోసిస్ డే


పాలకొండలో కుక్కలకు టీకాలను పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

అలాగే మండలంలోని బగ్గందొరవలస, నిడగల్లులో పశు వైద్య అధికారి ఎస్.రామారావు ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం : కురుపాం, గుమ్మ పశు వైద్యశాలల్లో 56 పెంపుడు కుక్కలకు టీకాలు వేసినట్లు వెటర్నరీ వైద్య అధికారి కె.శైలజ తెలిపారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ అఖిలేష్, వెటర్నరీ అసిస్టెంట్ నరేంద్ర, మండల పశుసంవర్ధకశాఖ సహాయకులు, జంతు సంరక్షకులు పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్.మన్మధరావు ప్రారంభించారు. కార్యక్రమంలో 45 పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు, పిల్లులకు ఏటా ఒక్కసారైనా రేబిస్ టీకాలు వేయించాలని, తద్వారా జంతువుల నుంచి మనుషులకు వ్యాప్తి చెందే వ్యాధులను అరికట్టవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక పశు వైద్యశాల ఎడి మాణిక్యరావు, వీరఘట్టం మండల పశువైద్య అధికారి చైతన్య శంకర్, పశువైద్య సిబ్బంది, పలువురు కుక్కల యజమానులు పాల్గొన్నారు.


బీజామృతం తయారీని రైతులకు వివరిస్తున్న వ్యవసాయాధికారులు

బీజామృత శుద్ధి.. పంటల అభివృద్ధి

ప్రజాశక్తి - పాచిపెంట

విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేసిన పిదప మాత్రమే విత్తనాలను నారు పోసుకుంటే భూమి ద్వారా వ్యాపించే విత్తనం ద్వారా వ్యాపించే శిలీంద్రాలు, తెగుళ్ల నుండి పంటకు రక్షణ కల్పించవచ్చని ఎపి సిఎన్ ఎఫ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎంజశ్రావణ్ కుమార్ అన్నారు. మండలంలోని పాంచాలిలో సామూహిక విత్తనశుద్ధి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.బీజామృతంతో విత్తనాలను శుద్ధి చేయడం వల్ల తెగుళ్ల నుండి రక్షణ పొందడమే కాకుండా విత్తన మొలక శాతం కూడా పెరుగుతుందని తెలిపారు. 100 లీటర్ల నీటికి ఐదు లీటర్ల ఆవు మూత్రం కలిపి దానిలో 10 కేజీల ఆవు పేడను ఒక గుడ్డ సంచిలో మునిగి ఉండేలా ఒక రోజంతా ఉంచి మరుసటి రోజు ఆ ద్రావణానికి 250 గ్రాముల సున్నం కలిపి సరిపడా విత్తనానికి పిచికారీ చేసుకుంటూ ద్రావణాన్ని బాగా పట్టించి రెండు గంటలు ఆరబెట్టిన తర్వాత నారు పోసుకోవాలని సూచించారు. గ్రామ సర్పంచ్ యుగంధర్ మాట్లాడుతూ ఎలాంటి ఖర్చు లేకుండా తయారయ్యే బీజామృతం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, కేవలం 10 నిమిషాల శ్రమతో మన పంటలను రక్షించుకోవచ్చని, కావున రైతులంతా ఈ విధానాన్ని తప్పక పాటించాల్సిన అవసరం ఉందని తెలిపారు. విత్తనాల బీజామృత శుద్ధి అనంతరం నారు శుద్ధి కూడా బీజామృతంలో ముంచి చేసుకుంటే మరింత ఫలితాలు వస్తాయని ఎఒ కె.తిరుపతిరావు అన్నారు. కార్యక్రమంలో విఎఎ ఈదిబిల్లి శ్రీను, ప్రకృతి సేద్య ప్రతినిధులు యశోదమ్మ, తిరుపతినాయుడు రైతులు పాల్గొన్నారు.

'నాకు న్యాయం చేయండి'

వివాహిత వేడుకోలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తనకు న్యాయం చేయండి అంటూ జియ్యమ్మవలస మండలం గడసింగుపురం గ్రామానికి చెందిన బొమ్మాళి అమూల్య పోలీసులను, గిరిజన సంఘం నాయకులను వేడుకుంది. 2021లో అమూల్యకు అదే గ్రామానికి చెందిన రాజారావుతో వివాహమైంది. పెళ్లిన కొద్దిరోజుల వరకు బాగానే ఉన్నామని, ఆ తర్వాత తన భర్త, తల్లిదండ్రులు ప్రకాష్, రవణమ్మ, అక్క పెద్దింటి నీలవేణి వేధించడం ప్రారంభించారని అమూల్య తెలిపింది. వేధింపుల కారణంగా తన పుట్టింటికి వచ్చేశానని చెప్పింది. అయితే తన తమ్ముడు, మరదలు తమ ఇంటి వద్ద ఉండొద్దని అనడంతో తన భర్త రాజారావు వద్దకు ఆదివారం వెళ్లానని తెలిపింది. మా ఇంటికి రావద్దని, వస్తే చంపేస్తామని అత్త, మామ, ఆడపడుచుతో సహా తన భర్త కూడా ఇంటి నుంచి గెంటేసారని విలపించింది. తనకు చావడం తప్ప వేరే ఆధారం లేదని, తనకు న్యాయం చేయాలని, నాపై దాడి చేసిన వారిపై చట్టపరంగా శిక్షించాలని జియమ్మ వలస పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అమూల్యకు న్యాయం జరగాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె సీతారాం డిమాండ్ చేశారు.


పోలీసులకు ఫిర్యాదుచేస్తున్న బాధితురాలు

బాబోయ్ కుక్కలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్ పేట గ్రామాల్లో వీధి కుక్కలు బెడద ఎక్కువగా ఉంది. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన రోడ్లపై ఎక్కడ చూసినా ఐదు నుంచి పది వరకు కుక్కల గుంపు ఎక్కడికక్కడ కనిపిస్తుంది. గుంపులు గుంపులుగా కుక్కలు తిరగడంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఎటు నుంచి వచ్చి ఏ కుక్క కాటు వేస్తుందో తెలియని పరిస్థితి. దీంతో ఒంటరిగా బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఈ ప్రాంతంలో గతంలో కాటు బాధితులు ఉన్నారు. జియమ్మవలస మండలంలో కుక్కల దాడిలో మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. ఇటువంటివి పునరావృతం కాకుండా అధికారులు నివారణా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఉరి వేసుకుని మహిళ మృతి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని గుమ్మిడిగూడకు చెందిన మజ్జి సీమమ్మ (18) చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. సీతమ్మ తల్లి మజ్జి పైడమ్మ ఇచ్చిన ఫిర్యాదు వివరాలిలా ఉన్నాయి. మజ్జి సీమమ్మను పాసివలసకు చెందిన పెదకాపు ఎరకయ్యతో ఏడాది క్రితం పెళ్లి అయ్యింది. అత్త మామలు, భర్త వేధింపులపై ఇటీవల గ్రామ పెద్దల సమక్షంలో తగువు పెట్టగా మరెప్పుడూ వేధించమని అంగీకరించారు. అయితే ఎప్పటిలాగే వేధింపులు పెట్టారు. వేధింపులను తాళలేక నాలుగు, అయిదు రోజులు క్రితం అత్తవారి ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. దీంతో ఆమె ఆచూకీ కోసం తమతో పాటు అల్లుడు కూడా గాలించారు. చెట్టుకు ఉరి వేసుకొని చనిపోయిన భార్యను ఎరకయ్య చూసి అత్తకు చెప్పారు. తామంతా వెళ్ళి చూడగా చెట్టుకు ఉరి పోసుకొని చనిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకట సురేష్ తెలిపారు.


ఉరివేసుకొని మృతి చెందిన సీమమ్మ

రోడ్డు ప్రమాదంలో యువకుడి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కురుపాం

రోడ్డు ప్రమాదంలో యువకుడుకి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో ఉదయపురం-కాకితాడ రోడ్డు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం ఉదయపురం పంచాయతీ దాసుగూడ గ్రామానికి చెందిన బిడ్డక సోమేశ్ ద్విచక్ర వాహనంతో కాకితాడకు నిత్యవసర సరుకుల కోసం వెళ్తుండగా మార్గమధ్యలో వాహనం అదుపు తప్పి బోల్తా పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. అటువైపుగా వెళ్తున్న కురుపాం మండల గిరిజన సంఘం కార్యదర్శి బిడ్డిక అనిల్ వెంటనే గుమ్మలక్ష్మీపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్య సిబ్బంది అక్కడ చికిత్స అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో చాలాచోట్ల రోడ్లు మరమ్మతులకు గురయ్యాయని, దీంతో వాహనదారులు, ప్రజలు నిత్యవసర సరుకులు, వైద్యం కోసం ఇటు మొండెంఖల్ గానీ అటు గుమ్మలక్ష్మీపురం గాని వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వ స్పందించి రోడ్లు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు.


రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రుడు